# సౌందర్య లహరి

ప్రాయోజకులు Ph: 22702

**రోహిణి మెటర్నటి & నర్సింగ్ హోం**

సిద్ధిపేట

డా॥ సుగుణా సతీష్ — S. DGO ( Osm )

డా॥ సతీష్ — M.S.D.L.O.
చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్ట్

ఇది ప్రభుత్వ అమోదిత కుటుంబ సంక్షేమ కేంద్రము

అల్ట్రా సౌండ్ స్కానింగ్ సౌకర్యం కలదు

గోడ గడియారం ట్రింగ్ మంది. ఎనిమిదిన్నరైందన్న మాట.

ఆకాశమైదానమ్మీద మబ్బు కన్యలు దాగుడుమూతలాడుకుంటూ సూర్యుని కళ్లు మూసేస్తున్నారు. చలిపులి మనిషి మీదనే స్వారి చేస్తోంది. పైరగాలి జోరు తగ్గలేదు. వరండా దిగుతున్న పరంధామం మాస్టారి దృష్టి - మెట్ల పక్కన మౌన సంభాషణలో తాదాత్మ్యం పొందుతున్న మల్లెతీగ, మందారం వైపు మళ్ళింది. మునిగాళ్లకు షడెన్ బ్రేకులు, మానస వీణ మధురిమలు.

ఆకులో ఆకునై, పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై, నునులేత రెమ్మనై.... ఆహా! ఎంత చక్కని ఊహా! ఎంత చక్కని పదవ్యూహం!'

" కొత్త జిల్లా కలెక్టర్ రేపు మనూరొస్తున్నారు. మన పాఠశాలను సందర్శిస్తారు. మనమంతా కాస్త ముందే రావాలి సుమా! "

ప్రధానోపాధ్యాయుడిగా నిన్న తోటి ఉపాధ్యాయుల్ని కోరిన సంగతి బుర్రలో మెరిసింది.

కళ్లు నవ్వాయి. కాళ్లు కదిలాయి. మనసు టేకోవరైంది.

"నమస్కారం మాస్టారూ!" కోకిలగొంతు. హేమంతములొ వసంతాగమనమా!

కలువ కళ్లు, దొండపండు పెదాలు, పచ్చి పాలలో ఎర్ర చందనం రంగరించిన దేహ ఛాయ... దేవలోకము నుండి దిగివచ్చి అజంతాలో అలంకరించుకున్న అప్సరసలాగుంది.

ఎవరీమె? ఎందుకొచ్చిందీ?

ప్రతి నమస్కారము చేసి వెనక్కు మళ్లక తప్ప లేదు.

"స్కూలు కింకా చాలా టైముంది గదా మాస్టారూ!" ముక్కు పుడక నీలపు రాయి నుదుటి కుంకుమ బొట్టు దిశగా తళుక్కుమంది.

అష్టమీ చంద్ర విభ్రాజ దళిక స్థల శోభితా, ముఖచంద్ర కళంకాభ మృగనాభి విశేషకా ... శ్రీ లలితాదేవి కదలిరాలేదు గదా!

"ఉంది గానీ ... కూచోమ్మా" అంటూ కుర్చీలో కూచున్నాడు. అప్పర్ప నుంచునే ఉంది.

"నేనూ ... నేను .. !" మొహం ముద్దమందారమైంది.

ఊళ్లో ఎవరికి సమస్య వచ్చినా సలహా కోసం వస్తుంటారు.

" చెప్పమ్మా! "

"నేను ... మీ స్టూడెంటును మాస్టారూ!"

ఎదపొదలో మలయమారుత పవనాలు.

"నా స్టూడెంటువా! ఎప్పుడూ? ఎక్కడా? ఏం పేరమ్మా?"

చెప్పింది.

పీతాంబరాన్ని నా జాగ్గా సవరించుకొంటూ మొగ్గలా ముడుచుకుపోతూ కూచుంది.

ప్రకృతి కాంత పరవశించిన పల్లెటూరు చింతమడ్క. మల్లి ... ఓహ్ .. గుర్తుకొస్తుంది.

ఆ రోజుల్లో చింతమడ్కలో ఉద్యోగం చెయ్యడమంటే చింతనిప్పుల మీద నడవడమే. పైరవీ పరదాల గాలి సోకని పరంధామం మాస్టారు స్వభావం చింతమడక బదిలీని సంతోషంగా స్వీకరించింది. నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుందన్న పెద్దల మాట చద్దిమూటైంది. కాని ... ఓ రోజు ...

రోజూట్లాగే ఐదో తరగతిలో లెక్కల కాపీల పరిశీలన. కాపీలు తేని పిల్లలు నుంచోమనగానే లేచి నుంచున్నారు.

రోజా సీతాకొకచిలకలా ఎగిరొచ్చి కాపీ చూపించే మల్లి గూడా నుంచుంది. ముందు బెంచిలో కూచునేది వెనక బెంచిలో నత్తగుల్లలా ... నిన్న గూడా కాలం - దూరం సూత్రమడిగితే చెప్పక బెత్తం దెబ్బ రుచి చూచింది.

చదువులో మాణిక్యంలాగున్న అమ్మాయి మసిబొగ్గులా మారుతుందెందుకూ? ఆశ్చర్యం ... అసహనం. ఈమె బంగారు భవిష్యత్తులోంచి రాళ్లూ - ముళ్ళను ఏరెయ్యాల్సిందే.

" చెయ్యి చాపు ".

కుడి చెయ్యి చాచింది. నిన్న దెబ్బ తిన్న చెయ్యి గూడా అదే.

టపటపా మూడు బెత్తం దెబ్బలు. మల్లి కనురెప్పలు శ్రావణమేఘాలైనాయేతప్ప గొంతు పెగల్లేదు. పెదాలు కదల్లేదు.

పాఠం మధ్యలో మల్లి పక్కనున్న అమ్మాయి అదిరిపడ్డట్టు చటుక్కున లేచి నుంచుంది.

" మల్లి చేతికి రక్తం సార్!"

వెళ్లి చూస్తే చెయ్యి గోగుపూవులాగుంది. వేళ్ల చిట్లి రక్తం కారుతూంది.

అరెరే! దెబ్బ బాగా తగిలిందే! ఛీ వెర్రి ఆలోచన, మనసు మెలి పెట్టింది. తన మీద తనకే కోపమొచ్చింది.

వెంటనే ప్యూన్‌ను పురమాయించి టింక్చర్, దూది వగైరాలు తెప్పించాడు. చెయ్యిని శుభ్రంగా కడిగి కట్టు కట్టాడు. అన్నింటికీ మల్లి మరబొమ్మలా సహకరిస్తుందే తప్ప పల్లెత్తు పలకడం లేదు. కడుపులో పాతాళ గరిగ వేసి దేవినట్టనిపించింది.

"మరి ... హోం వర్కెందుకు చెయ్యలేదు మల్లీ?" గొంతులో తీగతెగిన వీణానాదం.

తపస్వినిలా కళ్లు పైకెత్తి చూచింది. ఆ చూపును విశ్లేషిస్తే ఎన్ని భావతంత్రులు జతులు సవరిస్తాయో!

" మల్లికి మూడు రోజుల నుండి జొరం సార్. నిన్నటి దెబ్బకు చెయ్యి ఉబ్బింది. నొప్పితో హోంవర్క్ చెయ్యరాలేదట సార్!" మల్లి పక్కమ్మాయే చెప్పింది.

అయ్యో రామ! ఎంత పనైంది!

" ఆ సంగతి ముందే చెబితే బాగుండేది మల్లీ!"

" మీరడిగిన సూత్రం చెప్పకపోవడం తప్పేగద సార్!"

చిన్నారి చిలుకపలుకులు గుండె గోడల్ని తొలిచాయి.

" కానీ ... జ్వరమొచ్చిందని చెప్పొచ్చు గదమ్మా!"

"మొన్న కొంచెం జొరమొచ్చింది. చదువుకుంటానంటే అమ్మ వద్దన్నది. చదువుకుంటే సూత్రం నోటికి వచ్చేది. "

అయ్యో పిచ్చి పిల్లా! ఆరబోసిన అమాయకత్వం.అబద్ధం చెప్పలేని నిర్మలతత్వం. ప్చ్ ... పొరపాటైందేమో! తొందరపడ్డానేమో!

కొండనాలిక్కి మందు వేస్తే ఉన్న నాలిక ఊడిపోయే ప్రమాదమేర్పడిందప్పుడే.

రాజకీయాలలో రాటుదేలిన వేలిముద్రల పాల మల్లయ్య పంచాయతీ వార్డు మెంబరు. పాలల్లో నీరు కలిపి అమ్మడం నేరమని తెలుసు కాబట్టి నీళ్లలో పాలు కలిపి అమ్మేవాడు. ఇదేమని ఎవరన్నా నిలదీస్తే నిల్చున్న ఫలంగా పళ్లూడబీకి అరచేతిలో ఆరబెట్టే రకం. ఊరందరికి పాలమ్మి

తాను మాత్రం నాటుసారా సేవించడం హాబీగా పెట్టుకున్నాడు. ఊళ్లోని మంచీ - చెడు సంఘటనలన్నిటితో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోవడం హ్యాబిట్‌గా మారింది.

టీచరనే క్రీచరు ఏ విద్యార్థినైనా కొట్టాడని తెలవడమే ఆలస్యం. తుఫానుగా మారి ఉప్పెనలా ముంచుకొచ్చే వాడు.

చిన్నా పెద్ద తేడాలను పక్కకు నెట్టేసి అందరి సమక్షంలో బూతుల పంచాంగం విప్పి భూత భవిష్యత్ వర్తమానాలు కళ్లలో కదలాడేలా వాయించేవాడు.

పడ్డవాడెప్పుడు చెడ్డవాడు కాదని సదరు టీచరు సరిపెట్టుకున్నాడా సరేసరి. లేకపోతే తదుపరి కార్యక్రమం చెంపల్ని తబలాగా మార్చి తాళం మార్చుతూ వాయించడమే తరువాయి.

ఎవరితో చెప్పుకున్నా అది అరణ్యరోదనమే.

" అబ్బా! పాల మల్లయ్య కూతురు మల్లినే కొట్టారా?" హెడ్మాస్టరు కళ్లు ఏనుగు చెవులంతైపోయాయి. వేలు ముక్కు మీదికెళ్లింది.

"ఇహ కాచుకోండి. పాల మల్లయ్య పంచాంగ శ్రవణానికి చేతులు కట్టుకుని, చెవులు విప్పుక్కూచోండి." తెలుగు పండితుల వారి భరతనాట్య భంగిమ.

"ఎరక్క పోయి ఇరుక్కు పోయారు సార్ ..."

" ఆరేసుకోబోయి పారేసుకోవడమంటే ఇదే మరి."

" మల్లి ఇంటి పని చెయ్యకపోతే మన ఇంటికేం ఢోకాలేదు గదా!"

తోటి భావి భారత రత్న నిర్మాతల విసుర్లూ, వ్యాఖ్యానాలు ఇకిలింతలు, సకిలింతలు.

ఎన్నడూ ఎవరితోనూ మాట పడలేదు. క్షమాగుణం ఉపాధ్యాయుడికి ఉండాల్సిందే గాని అది విద్యార్థి భవిష్యత్తుకు అవరోధమనిపిస్తే శిక్షించడమే ఉపకారము. అసలూ, బెత్తెం దెబ్బ రుచి చూడకుండా చదువు ఎవరికైనా అబ్బిందా? ఏమిటో కాలం మారింది. పాల మల్లయ్య ప్రతాపం ఎంతటి అవమానానికి దారి తీస్తుందో? పోనీ! సెలవు పెట్టి ఎక్కడికైనా ఉడాయిస్తే! నో... అది పిరికితనం , బుర్రనిండా చింపిరి తెరలు, చిల్లుల ఆలోచనలు, రాత్రంతా కునుకులేదు. బాలభాస్కరుని చైతన్య కిరణాలు నిబ్బరాన్ని నిలిపేశాయి. రోట్లో తలకాయ పెట్టి రోకటి దెబ్బకు వెరుపెందుకంటూ - యమకింకరుల శిక్షననుభవించేందుకు తయారైన పాపిలా మార్చేశాయి.

పాఠశాలలో పదకొండైంది. లఘు విశ్రాంతి బెల్లైంది. పది సినిమాలు ఒకే సారి వదిలినట్టు బిలబిలమంటూ పిల్లలు బయటికెళ్తున్నారు. ఉపాధ్యాయులు స్టాఫ్‌రూంకొస్తున్నారు.

అప్పుడే చిరుగాలికి ఊగుతున్న చెట్టుకొమ్మలా కదులుతూ స్కూలు గేటు దాటి ప్రత్యక్షమయ్యాడు పాల మల్లయ్య. స్టాఫు మొహాలు సప్త వర్ణ చిత్రాలయ్యాయి. గుండె చప్పుళ్లకు నాలిక కండరాలు స్పందించకుండా జాగ్రత్తపడ్డం వినా గత్యంతరం లేక పోయింది పరంధామం మాస్టారుకు.

టీ.వి. అనౌన్సర్లా పెదాల మీద నవ్వులు పులుముకుని, "రండి మల్లయ్య గారూ! కూచోండి! " హెడ్మాస్టర్ ఎదురెల్లి స్వాగత కుసుమాలు విసిరాడు.

వాసన గుప్పుమంది. మత్తగజంలా వచ్చి గమ్మత్తుగా కూచున్నాడు. ట్రాజడి సినిమా నడుస్తున్న సినిమా హాలులా వాతావరణం గంభీరమైంది. తపస్సు నుండి తేరుకుంటున్న ఋషి పుంగవుడిలా కళ్లు పైకెత్తి అందరి మీద దృష్టి సారించాడు పాల మల్లయ్య.

" పరంధామం సారంటే ...!

" నేనే ...! "

" గీసారా? " కనుబొమ్మలు బంతుల్లా ఎగిరిపడ్డాయి. " ఈ ఊరికొచ్చి ఎంతకాలమైంది!"

" ఆర్నెల్లు దాటింది", హెడ్మాస్టర్ వెన్ను పూసలో ముసలం.

" మనూరికెందరో టీచర్లొచ్చి పోయింర్డు గాని గిసోంటి సారును చూల్లేదు."

ఆహా! పురాణం పేజీల్లోకి వెళ్లబోయే ముందు ఇది ఉపోద్ఘాతమన్నమాట. ఇహ రాబోయేది విద్యుద్ఘాతము. చెట్టు మీంచి రాలిన బొండు మల్లెల్లా టీచర్ల చూపులు నేల వాలాయి.

" మీకో దండం సార్! " చేతులు జోడించాడు పాల మల్లయ్య. కనుగుడ్లు ఎర్రబారున్నాయి. ఈ దండమే ప్రాణగండము, పరంధామం మాస్టారు ప్రాణాలరచేతిలో ఆడుకుంటున్నా... రోషం ఆగలేనంది.

" ఎందుకూ! నాకే ప్రత్యేకంగా! " ఎంత ధైర్యం ప్రోది చేసుకున్నా నాలిక తడారిపోతుంది.

" నిన్న మా మల్లి బెంచి మీద నుంచి కింద పడి వేళ్లు నలిగిపోతే రక్తం ఋబ్బరంగా కడిగి బ్యాండేజి కట్టింర్డట కదా! పిల్లలంటే మీకెంత ప్రేమనో! " గారదేలిన మునిపళ్లు గమ్మత్తుగా కనిపించడంతో నవ్వాడని అర్థమైపోయింది.

బెంచీ మీంచి పడిందా! టీచర్ల చూపులు గాలిపటాల్లా పైకి లేచాయి.

" ఎవరన్నారు మీతో? " కోమాలోంచి కోలుకుంటున్నట్టు హెడ్మాస్టర్ చూపుల్లో జీవం వచ్చింది.

"చేతికి ఆ కట్టేందని అడిగితే నిన్న మా మల్లే చెప్పింది. గీసారు చాలా మంచోరట. పాఠం బంగారమోలె చెప్తరట. మా మల్లి మురుస్తుంది. గిట్లనే మీ దయుండాలే సారూ! " మళ్లీ నమస్కరించి అదృశ్యమయ్యాడు. పరంధామం మాస్టారు గుండె గోడల నిండా జుంటితేనె పూతలు. ఆ నాటి ఆ మల్లి... ఈనాటి ఈ సిరిమల్లి... పూర్ణవికసిత పుష్పరాగము.

" బాగున్నావామ్మా? " హృదయ కేదారము దివ్యానుభూతి కెరటాలతో నిండిపోయింది.

" మీరు చూపించిన బాటలో నడిచాను. మీ శుభాశీస్సుల బలం వల్ల ఇలా ఉన్నాను మాస్టారూ ! " లేచి పాదాలు స్పృశించింది.

కదిలొచ్చిన సౌందర్యదేవత నా కాళ్లకు మొక్కడమా!

" అయ్యయ్యో లేమ్మా! నువ్వింకా చిన్న పిల్లవు కాదు గదా! "

" మీ ముందు నేనెప్పుడూ చిన్నదాన్నే మాస్టారూ! "

మాస్టారు కళ్లల్లోంచి రాలిన ఆనందబాష్పాలావిడనభిషేకించాయి. కొన్ని నిమిషాలు గడ్డకట్టుకుపోయాయి.

" చాలా సంతోషమమ్మా! ఎంతో మాట్లాడలనుంది. కాని ఈ రోజే ఈ ఊరికి కొత్త కలెక్టర్ గారొస్తున్నారు, మా బడి చూపించాలి."

వంది మాగదులతో ప్రవేశించిన మండల రెవెన్యూ ఆఫసర్ ఇద్దరికి నమస్కరించాడు.

" అదేమిటి మాస్టారూ! గౌరవనీయులైన మన కొత్త కలెక్టర్ శ్రీమతి మల్లీశ్వరి గారు మీ ముందే ఉన్నారు గదా! " అంటూ చేతులు కట్టుకు నుంచున్నాడు.

మల్లెపూలూ, మందారాలు నవ్వుతున్నాయి.

ఆంధ్రప్రభ, తేది. 30 - 9 - 1997.